సాక్షి గుంటూరు


శుక్రవారం । 5 । జూలై । 2024



అల్లూరికి నివాళి
చిలకలూరిపేట: ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద గురువారం ఆయన జయంత్యుత్సవాన్ని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు.



విత్తన దుకాణాల తనిఖీ
ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని విత్తన దుకాణాలు, గ్రోమోరు సెంటర్‌ను గురువారం ఏఓ వానంతి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, కొనుగోలు రిజిస్టర్‌లను పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 503.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి లోకేష్



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారిని మంగళగిరి ఎమ్మెల్యే, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం దర్శించుకున్నారు. ఆయన రాకను పురస్కరించుకుని వేదపండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూతనంగా నిర్మిస్తున్న దేవాలయాన్ని పరిశీలించి పనులు జరుగుతున్న తీరు గురించి ధర్మకర్తలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం మెరుగైన రోడ్లు, పార్కింగ్ సౌకర్యం, పరిశుభ్రత ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసి దేవాలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నారా లోకేష్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యార్డులో 33,108 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 31,752 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 33,108 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.19,200 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ.16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,500 నుంచి రూ.19,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 17,419 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వర్సిటీలో విద్యాసంస్థల బంద్ విజయవంతం



ఏఎన్‌యూ : అసమర్థ జాతీయ స్థాయి పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తూ గురువారం నిర్వహించిన బంద్ సంపూర్ణంగా జరిగింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నవిత, యూనివర్సిటీ అధ్యక్షుడు సంతోష్, అజయ్, రాజేష్, ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు నాసరయ్య తదితరుల ఆధ్వర్యంలో ఈ బంద్ జరిగింది.

ఎన్నారై మృతి కేసులో అత్తను విచారించిన సీఐడీ

నగరంపాలెం: అమెరికాలో గుంటూరు యువకుడు గంగూరి శ్రీనాథ్ అనుమానాస్పద మృతి కేసులో నిందితురాలు, అత్త సుఖవాసి రాజశ్రీని బుధవారం రాత్రి హైదరాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తనయుడు శ్రీనాథ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ తండ్రి బాబురావు గత ఏడాదిలో ఏపీ సీఐడీ అధికారులను ఆశ్రయించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో రాజశ్రీతోపాటు, మావ సుఖవాసి శ్రీనివాసరావు, శ్రీనాథ్ భార్య సాయిచరణిపై సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణలో ఉండగా కోర్టుకు, సీఐడీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా కుమార్తె సాయిచరణి వద్దకు రాజశ్రీ అమెరికా వెళ్లారు. దీంతో రాజశ్రీ అమెరికా వెళ్లారని తెలిసి, సీఐడీ లుక్ అవుట్ నోటీసు జారీచేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి అమెరికా నుంచి వచ్చిన వెంటనే రాజశ్రీని ఇమ్మిగ్రేషన్ అధికారులు హైదరాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఆమెను ఇమ్మిగ్రేషన్ అధికారులు ఏపీ సీఐడీ అధికారులకు అప్పగించగా, ఉదయం విచారించి పంపించినట్లు తెలిసింది.

డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు 10 వరకు గడువు

- నేటి నుంచి హెల్ప్‌లైన్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన
- గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు
- ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశ పెట్టిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ తరహాలో సీట్ల కేటాయింపు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు



గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికై ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు ఈనెల 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) అమల్లో భాగంగా సమూల మార్పులతో డిగ్రీ కోర్సులను తీర్చిదిద్దిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత రెండు విద్యాసంవత్సరాల్లో అమలు పరుస్తూ వచ్చిన ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎండీసీ) విధానంలోనే 2024-25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వం అడ్మిషన్లు కల్పిస్తోంది. ఏపీ ఈఏపీసెట్ తరహాలో ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లను భర్తీ చేసిన విధానంలోనే డిగ్రీ కళాశాలల్లో సీట్లను భర్తీ చేస్తున్నారు.

గత ప్రభుత్వం తెచ్చిన సంస్కరణల బాటలోనే అడ్మిషన్లు

విద్యారంగంలో గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సంస్కరణల్లో భాగంగా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు పారదర్శక విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం డిగ్రీ కోర్సులకు ఇదే విధానంలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు, బాపట్లలోని మహిళా కళాశాలలు, చేబ్రోలు, రేపల్లె, వినుకొండ, మాచర్లలోని కో-ఎడ్యుకేషన్ కళాశాలలతోపాటు ప్రైవేటు, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు జరుగుతున్నాయి.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు 10 వరకు గడువు

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 10 వరకు గడువు ఉంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో (సెట్స్.ఏపీఎస్సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్) ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రాసెసింగ్ ఫీజు రూపంలో ఓసీ విద్యార్థులు రూ.400, బీసీ రూ.300, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.200 చొప్పున డెబిట్, క్రెడిట్‌కార్డు ద్వారా చెల్లించాలి. రిజిస్ట్రేషన్ సమయంలో అన్ని ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాల పరిశీలనకు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. గుంటూరు జిల్లా పరిధిలోని విద్యార్థుల కోసం గుంటూరు నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో శుక్రవారం నుంచి విద్యార్థుల ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తారు.

11 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఈనెల 11 నుంచి 15 వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈనెల 19న సీట్ల కేటాయింపు జరపనుండగా, ఈనెల 20, 21, 22 తేదీల్లో విద్యార్థులు కళాశాలల్లో చేరాల్సి ఉంది. డిగ్రీలో ప్రవేశానికై ఉద్దేశించిన పూర్తి వివరాలకు ఆన్‌లైన్‌లో పొందుపర్చిన నోటిఫికేషన్‌ను సందర్శించాలి.

మైనార్టీ విద్యార్థులకు ఏపీ టెట్ ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: మైనార్టీల ప్రాంతీయ విద్యాభివృద్ధి కేంద్ర (ఆర్సీఈడీఎం) ఆధ్వర్యంలో ఏపీ టెట్‌కు సన్నద్ధమవుతున్న మైనార్టీ విద్యార్థులకు పొన్నూరురోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఎండీ మస్తాన్‌వలి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం, క్రైస్తవ, పార్సీ, సిక్కు, జైన, బౌద్ధ అభ్యర్థులకు ఉర్దూ, తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉచిత శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి జరగనున్న ఉచిత శిక్షణ కోసం టెట్-2024 ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం జిరాక్స్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఆంధ్ర ముస్లిం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం విజయవాడ ఇంద్రకీలాద్రిపై శనివారం నుంచి ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆషాడ శుద్ధ పాడ్యమి అయిన శనివారం నుంచే వారాహి నవరాత్రులు ప్రారంభించేందుకు దేవస్థాన వైదిక కమిటీ నిర్ణయించింది. నెల రోజుల ఆషాఢ మాసంలో లోక కల్యాణార్థం జగన్మాత శ్రీదుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆషాఢ మాసం తొలి రోజున ఆలయ అర్చకులు, వేద పండితులు, వైదిక కమిటీ, ప్రధాన అర్చకులు సారె సమర్పిస్తారు. శనివారం ఉదయం అమ్మవారి ప్రధాన ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి అలంకరణ, నిత్య పూజల అనంతరం తొలి సారె సమర్పణ కార్యక్రమం జరుగుతుంది. అదే సమయంలో వారాహి నవరాత్రులను పురస్కరించుకుని కలశ స్థాపన, అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసే భక్తులు, ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థలు, భజన బృందాలు, దేవాలయాల కమిటీలను ఆలయ మర్యాదలతో స్వాగతం పలకడంతో పాటు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో కె.ఎస్.రామరావు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై గురువారం ఈవో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

15వ తేదీ వరకు వారాహి నవరాత్రులు

దుర్గమ్మ సన్నిధిలో ఈ ఏడాది తొలిసారిగా వారాహి నవరాత్రులను నిర్వహిస్తున్నారు. 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. అమ్మవారికి పంచ వారాహి మంత్రాలు, బృహద్ వారాహి, లఘు వారాహి, స్వప్న వారాహి, ధూమ్ర వారాహి, కిరాత వారాహి, చండీ పారాయణ, రుద్ర పారాయణ మంత్ర హోమాలతో పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మండప పూజ, హారతి, మంత్రపుష్పం సమర్పిస్తారు. ఆయా పూజలను దేవస్థానం తరఫున ఆలయ అర్చకులు మాత్రమే నిర్వహిస్తారు. 15వ తేదీ పూర్ణాహుతితో వారాహి నవరాత్రులు ముగుస్తాయి.

అంతర రాష్ట్ర సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

- రూ.2.26 లక్ష విలువ గల ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నిందితుడు ఏరోనాటికల్ ఇంజినీర్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఎస్ఐ కొండయ్య

చీరాల రూరల్: అతను ఉన్నత విద్యను అభ్యసించాడు. నలుగురికి స్ఫూర్తినివ్వాల్సింది పోయి దొంగగా మారాడు. జల్సాలకు అలవాటుపడిన ఓ ఏరోనాటికల్ ఇంజనీర్ రైళ్లలో సెల్‌ఫోన్లు దొంగతనాలు చేస్తున్నాడు. వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసూ తిరుగుతున్న అంతర రాష్ట్ర దొంగను చీరాల జీఆర్పీ పోలీసులు గురువారం అరెస్టు చేసి కటకటాల వెనక్కు నెట్టారు. గురువారం రైల్వే డెప్యూటీ సూపరింటెండెంట్ సీహెచ్. విజయ భాస్కర్, ఎస్ఐ కొండయ్యలు సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గుంతకల్లు రైల్వే ఎస్పీ కె. చౌడేశ్వరి ఆదేశాల మేరకు ఒంగోలు జీఆర్పీ సీఐ ఎస్. శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో చీరాల జీఆర్పీ ఎస్ఐ సీహెచ్. కొండయ్య గురువారం చీరాల నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా, అతని వద్ద ఆరు సెల్‌ఫోన్లు దొరికాయి. వీటి విలువ రూ.2,26,898 విలువ ఉంటుందని పోలీసులు తెలిపారు.

నిద్రిస్తున్న ప్రయాణికులే లక్ష్యం

నిందితుడు కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన ఇల్లూరు హరినాథ్‌రెడ్డి. ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదువుకుని ఉద్యోగం లేక ఖాళీగా తిరుగుతున్నాడు. అందినకాడికి డబ్బులు ఖర్చుచేస్తూ జులాయిగా తిరుగుతుంటాడు. ఈ క్రమంలో చిన్నచిన్న దొంగతనాలకు అలవాటుపడ్డాడు. రైళ్లలో తిరుపతి నుంచి తెనాలి వరకు ప్రయాణిస్తూ ప్రయాణికులు ఆదమరచి నిద్రించే సమయంలో వారి సెల్‌ఫోన్లు దొంగిలిస్తాడు. వాటిని బెంగుళూరు, గోవా వంటి ప్రాంతాలలో విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నాడు. డబ్బులు అయిపోయాక మరలా రైళ్లలో తిరుగుతూ సెల్‌ఫోన్లు దొంగిలిస్తూ, విక్రయించి జల్సాలు చేస్తున్నాడు. చివరికి చీరాల రైల్వే స్టేషన్‌లో పోలీసులు జరిపిన తనిఖీల్లో పట్టుబడి కటకటాలలోకి వెళ్లాడు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ సీహెచ్. కొండయ్య, రైల్వే అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్ అభినందించారు.

జాతీయ పురస్కారాలకు ప్రతిపాదనలు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2024కు అర్హుల నుంచి ప్రతిపాదనలు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు http:// nationalawardsto teachers.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈనెల 15లోపు సమర్పించాలని సూచించారు.

అల్లూరి తెగువ నేటి యువతకు స్ఫూర్తి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: బ్రిటీషు వారి అకృత్యాలకు వ్యతిరేకంగాను, ఆదివాసీల హక్కుల కోసం ప్రాణాలొడ్డి పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతరానికి స్ఫూర్తి అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కొనియాడారు. అల్లూరి జయంతి వేడుకలను పురస్కరించుకుని స్థానిక నాజ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి తెగువను దేశవ్యాప్తంగా కొనియాడుతున్నారన్నారు. అప్పటి బ్రిటీషు ప్రభుత్వం ఆదివాసీల సాగుపై కఠిన చట్టాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటం చాలా గొప్పదన్నారు. అమాయక గిరిజన, ఆదివాసీలకు అండగా ఉంటూ వారి కోసం తీవ్రంగా శ్రమించారన్నారు. అనంతరం కలెక్టర్, శాసనసభ్యులు గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలలు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి శిరీష, జీఎంసీ అడిషనల్ కమిషనర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖకు భారీగా ఆదాయం

- గతేడాది రూ.49.91 కోట్లు
- ఈ ఏడాది మూడు నెలలకే రూ.17.55 కోట్లు
- కిటకిటలాడుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయం



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న తాడికొండ రిజిస్ట్రేషన్ కార్యాలయం

తాడికొండ: గడిచిన రెండు నెలల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా పెరిగింది. రెండు నెలలుగా తాడికొండ మండలంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు కొనుగోళ్లు, అమ్మకాలు ఊపందుకున్నాయి. పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ ప్రకటించిన నేపథ్యంలో పూలింగ్ పరిసర గ్రామాలలో కొనుగోళ్లు, అమ్మకాలు ఊపందుకున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయం రెండు నెలలుగా కిటకిటలాడుతుంది. 2023 ఏప్రియల్ నుంచి 2024 మార్చి వరకు మొత్తం 7443 రిజిస్ట్రేషన్‌లకుగాను రూ.49.91 కోట్లు ఆదాయం రాగా, ఈ ఏడాది ఏప్రియల్ నుంచి జూన్ వరకు 2567 రిజిస్ట్రేషన్‌లకుగాను రూ.17.55 కోట్లు ఆదాయం లభించింది. మే నెలలో 720 రిజిస్ట్రేషన్‌లకు గాను కొనుగోళ్లు 452, గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌లు 57, ఇతరత్రా 211 రిజిస్ట్రేషన్‌లు కాగా జూన్ నెలలో మొత్తం 1194 రిజిస్ట్రేషన్‌లు జరగగా అందులో కొనుగోళ్లు 827, గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు 87, ఇతరత్రా 280 ఉన్నాయి. గతేడాది జరిగిన రిజిస్ట్రేషన్‌లలో మొత్తం ప్రైవేటు వెంచర్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌లే అధికంగా జరగగా మూడు నెలలుగా పంట పొలాల అమ్మకాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి.

ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం కిటకిటలాడుతుంది. రాజధాని నేపథ్యంలో సమీప మండలమైన తాడికొండకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. అటు పూలింగ్‌కు నాలుగు కిలోమీటర్లు, ఇటు గుంటూరుకు 14 కిలోమీటర్లు మాత్రమే దూరం ఉండి రెండిటికీ మధ్య ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అధిక సంఖ్యలో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు.

సఫాయి కార్మికులకు మేలైన ప్రయోజనాలు



మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మ చారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావ

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావ
- కమిషనర్ కీర్తి చౌరవ అభినందనీయం

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు నగరపాలక సంస్థలో సఫాయి కార్మికులకు మేలైన ప్రయోజనాలు అందుతున్నాయని, కార్మికుల సమస్యలు పరిష్కారంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి చౌరవ అభినందనీయమని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి.వావ అన్నారు. గురువారం వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సఫాయి కర్మచారి కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు, ప్రొహిబిషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ యాజ్ సీవెంజర్స్ రీహాబిలిటేషన్ యాక్ట్ 2013పై నగరపాలక సంస్థ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, సఫాయి కర్మచారి సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రజారోగ్య కార్మికులకు ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియం గుంటూరు నగరపాలక సంస్థ జనరల్ ఫండ్ నుంచి చెల్లించడం, ఔట్ సోర్సింగ్ కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా లేదా 60ఏళ్లు నిండినా వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించడం ద్వారా నగర కమిషనర్ కీర్తి చేకూరి కార్మికులకు అండగా ఉంటున్నారని తెలిపారు. నగరంలోని సఫాయి కార్మికులు, ఆయా సంఘాల ప్రతినిధుల నుంచి వివిధ సమస్యలపై పలు అర్జీలు అందాయని, నగరపాలక సంస్థ పరిధిలోని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయాల్సిన వాటికి సంబంధించి ప్రతిపాదనలు తనకు పంపితే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. సఫాయి కార్మికులకు హెపటైటీస్ బీ వ్యాక్సిన్ చేయించాలని, వారానికి ఒక రోజు పూర్తిగా సెలవు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. పర్మినెంట్ కార్మికుల మాదిరి ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా యూనిఫారం, ఐడీ కార్డు అందించాలన్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్‌ని కార్మికులకు కల్పించాలన్నారు.

సఫాయి కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ

నగర కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వర్తించే సఫాయి కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఒక్కొక్క కార్మికునికి మూడు ఎల్ఐసీ పాలసీలు తీసుకొని, వాటి ప్రీమియం జీఎంసీ నుండే చెల్లిస్తున్నామని, దీని వలన దురదృష్టవశాత్తు కార్మికులు ఏదైనా ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబానికి రూ.12 లక్షలు అందుతాయన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులు మరణించినా, 60ఏళ్లు నిండిన వారి కుటుంబ సభ్యుల్లో 49 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, మరో 15 మందివి ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ కింద 51 మంది కార్మికులకు పారిశుద్ధ్య నిర్వహణ యంత్రాలు ఇప్పించి, లోన్ ప్రీమియం చెల్లిస్తున్నామన్నారు. ఐడీ కార్డులు నెల రోజుల్లో ఇస్తామని, డివిజన్ల వారీగా పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం లేకుండా వారంలో ఒక రోజు సెలవు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల జీవన స్థితిగతులను మెరుగుపరచాలి

గుంటూరు వెస్ట్: పారిశుద్ధ్య కార్మికుల జీవన స్థితిగతులను అభివృద్ధి చేసేందుకు కావాల్సిన అన్ని చర్యలు తప్పక తీసుకోవాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ వావ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అధికారులతో డాక్టర్ వావ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సఫాయి కర్మచారుల ఆర్థిక పునరావాస కార్యక్రమాలు సక్రమంగా అమలు చేసే విధంగా ఆయా శాఖలు కృషి చేయాలన్నారు. మాన్యువల్ స్కావెంజర్స్‌ను ప్రభుత్వం 2013 రద్దు చేసిందని చెప్పారు. ఎక్కడైనా దీనిని ఉపయోగిస్తున్నట్లు తెలిస్తే జరిమానాతోపాటు కఠిన శిక్షలు విధిస్తారన్నారు.

ఎక్కడైనా సఫాయి కర్మాచారి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ మరణిస్తే రూ.30 లక్షలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. అతనిపై ఆధారపడే కుటుంబ సభ్యులకు కూడా ప్రయోజనాలు కల్పించిందని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంకులు రుణాలు ఇవ్వాలన్నారు. రుణాలు ఇచ్చే విధంగా లీడ్ బ్యాంకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆధునిక యంత్రాల కొనుగోలుకు రుణాల మంజూరుకు ఎస్సీ కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సఫాయి కర్మచారిల అభివృద్ధికి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. డీఆర్వో పెద్ది రోజా, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి, కార్మిక శాఖ డీసీ గాయత్రి రాణి, డీపీఓ శ్రీదేవి, జీఎంసీ అడిషనల్ కమిషనర్ రాజ్యలక్ష్మి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

సమస్యలపై కార్మిక సంఘాల వినతి

తొలుత గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సోమి శంకరరావు, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈ.మధుబాబు, ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.ముత్యాలరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.మాల్యాద్రి తదితర కార్మిక సంఘాల నాయకులు సఫాయి కార్మికుల సమస్యలపై జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి. వావ దృష్టికి తెచ్చి, వినతిపత్రాలు అందించారు. వావ మాట్లాడుతూ కార్మిక సంఘాలు ఇచ్చిన వినతిపత్రాలలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జీఎంసీ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి డిప్యూటీ కమిషనర్లు టి.వెంకటకృష్ణయ్య, సీహెచ్. శ్రీనివాస్, వెంకటలక్ష్మి, ఎస్ఈ. శ్యాం సుందర్, సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్, నగరపాలక సంస్థ అధికారులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

ఆర్డీఓ పి.శ్రీకర్



గుంటూరు వెస్ట్: గర్భస్థ లింగ నిర్ధారణలో స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాల్సిందేనని, అతిక్రమించే వారిని డొకాయ్ ఆపరేషన్స్ ద్వారా గుర్తించాలని ఆర్డీఓ పి.శ్రీకర్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు, మూడు నెలలకొకసారి సమావేశాలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాలలో ఐఈసీ బోర్డులు పెట్టాలన్నారు. సమాజ హితం కోరి ప్రభుత్వం ఏర్పాటు చేసే నిబంధనలు పాటించడం సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజు, వైద్యులు పాల్గొన్నారు.

అమరావతి రక్షణ కోసం హనుమాన్ చాలీసా



అనంతవరం(తాడికొండ):అమరావతి రాజధాని మహానగరం నిర్మాణంతోపాటు రాష్ట్ర సర్వోత్తముఖాభివృద్ధి లక్ష్యంతో తుళ్లూరు మండలం అనంతవరంలో అష్టోత్తర శత హనుమాన్ చాలీసా గాన యజ్ఞం నిర్వహించారు. జాతీయ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో కంచి కామకోటి శంకర మఠం పీఠాధిపతులు జగద్గురువు శంకర విజయేంద్ర సరస్వతీస్వామి ఆధ్వర్యంలో గీతా పారాయణం, అష్టోత్తర శత హనుమాన్ చాలీసా గాన యజ్ఞం వైభవంగా నిర్వహించారు.

గృహ హింసపై కేసు నమోదు

వేమూరు: భర్త గృహ హింసపై ఓ వివాహిత ఫిర్యాదు మేరకు వేమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వేమూరు గ్రామానికి చెందిన గుర్రం సుధీర్‌బాబు మొదటి భార్య అనారోగ్యంతో చనిపోవడంతో దివ్యను రెండో వివాహం చేసుకున్నాడు. సుధీర్‌బాబుకు ఇద్దరు మగ పిల్లలున్నారు. ఇద్దరినీ దివ్య బాగా చూసుకుంటున్నా కూడా సంతృప్తి చెందేవాడు కాదు. ఆమెపై అనుమానంతో శారీరంగా, మానసికంగా వేధించేవాడు. దీన్ని భరించలేక దివ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ధైర్య సాహసాలకు ప్రతీక అల్లూరి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



జెడ్పీలో అల్లూరి జయంతి కార్యక్రమంలో ఉద్యోగులతో చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ధైర్య సాహసాలకు ప్రతీక అల్లూరి సీతారామరాజు అని, ఆయన అందరికీ ఆదర్శనీయుడని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ 27 ఏళ్లే జీవించిన అల్లూరి దేశ స్వాతంత్య్రం కోసం బ్రిటీషువారికి ఎదురునిలిచి పోరాటం చేశారని కొనియాడారు. బ్రిటీషు బానిస సంకెళ్లను తెంచేందుకు ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. స్వాతంత్య్రం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు అల్లూరి అని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ కార్యాలయంలో..

నగరంపాలెం: సమ సమాజ స్థాపనకు అల్లూరి సీతారామరాజు చూపిన బాట అందరికి ఆదర్శప్రాయమని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గుంటూరు నగరంపాలెంలోని రేంజ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్య్ర ఉద్యమంలో చేసిన పోరాట స్ఫూర్తిని అందరం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో గురువారం స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు కొనసాగించిన విప్లవ పోరాటం తెలుగు జాతి చరిత్రలో క్రియాశీలక ఘట్టంగా ఉంటుందని అన్నారు. సీతారామరాజుని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, సీఐలు బిలాలుద్దీన్ (డీసీఆర్బీ), వెంకటరావు (ఎస్బీ), ఆర్ఐ శ్రీనివాసరావు, సీసీ ఆదిశేషు పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో...

గుంటూరు రూరల్: సాయుధ పోరాటంలో బ్రిటీష్ సైన్యానికి సరైన సమాధానం చెప్పిన స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి తెలిపారు. గురువారం లాంఫాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గిరిజనులను కూడగట్టి పోరాడిన ధీరుడు అల్లూరి అని తెలిపారు. అనంతరం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్రరావు, డీన్ డాక్టర్ జి కరుణసాగర్, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ ఎన్వీ రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బి శ్రీలక్ష్మి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ డీ ప్రమీలరాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ డి సంపత్‌కుమార్, డీన్ డాక్టర్ పీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐజీ త్రిపాఠి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి

మైనారిటీ మహిళల హక్కుల పరిరక్షణకు కృషి

- గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా
- మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం



డాక్టర్ షమ సుల్తానాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

గుంటూరు మెడికల్ రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ మహిళలను విద్య, వైద్య రంగాల్లో చైతన్యపరిచి, వారి హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆమెను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ షారుకి శుక్లి నియామక పత్రం అందజేశారు. గురువారం స్థానిక గుంటూరు నగరంలోని ఎం కన్వెన్షన్ హాలులో మైనార్టీల ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ షారుకి శుక్లి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మైనారిటీ హక్కుల కోసం అనేక ఏళ్లుగా అంశాల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మైనార్టీల పక్షపాతి ప్రభుత్వమని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా అన్ని వర్గాలకు అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్య సేవలను నిరుపేదలకు అందిస్తున్న డాక్టర్ షమ సుల్తానాను తమ సంఘంలోకి ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ముస్లిం మైనార్టీలు అందించిన అపూర్వమైన మెజారిటీ మర్చిపోలేనిదని చెప్పారు.

ముస్లిం సమాజానికి శక్తివంచన లేకుండా తన వంతు సహాయం చేస్తానన్నారు. అనంతరం డాక్టర్ షమ సుల్తానాను అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో హోప్‌విన్ హాస్పిటల్ అధినేత, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజిరుద్దీన్, సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోండి

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌కు 350 మంది హాజరు



సర్టిఫికెట్‌లు పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ చిన్న వెంకటేశ్వర్లు

తెనాలిఅర్బన్: వృత్తిలో నైపుణాన్ని పెంపొందించుకోవాలని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ టెక్నికల్ విద్యకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని చెప్పారు. కోర్సు పూర్తయ్యే నాటికి విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పించాలనే ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో చదువుతున్న 350 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. వీరికి చదువు పూర్తయిన తర్వాత సదరు సంస్థలు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమర్ బ్యాటరీస్, ఎస్ఎస్‌సీ టెక్స్‌టైల్స్, జోసిల్, ఐటీసీ, టీవీఎస్, బ్లూస్టార్, ఈక్విక్‌డైస్ తదితర సంస్థల ప్రతినిధులు ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపల్స్ టి ఇమ్మానుయేలు, ఎ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బసవయ్య



బసవయ్యకు నియామక పత్రం అందజేస్తున్న ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు రాజారావు

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంగళగిరి రూరల్ మండలం బేతపూడి గ్రామానికి చెందిన ఉన్నం బసవయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం మంగళగిరి పట్టణ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నియామక పత్రాన్ని ఉన్నం బసవయ్యకు అందజేశారు. బసవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందేలా ప్రయత్నిస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రేమళ్ల సాంబశివరావు, నాయకులు నూతక్కి అమరయ్య, కురగంటి చిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి వాసనల కథకుడు కాట్రగడ్డ దయానంద్



పండుటాకు- గుండ్లకమ్మ తీరాన కథా సంపుటి పుస్తకావిష్కరణ సభలో అతిథులు

నగరంపాలెం: మధ్యతరగతి జీవితాలకు, రైతుల వెతలకు అద్దం పట్టే కథల రచయిత కాట్రగడ్డ దయానంద్ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఈశ్వర వరప్రసాద పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బృందావన్‌గార్డెన్ శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై కాట్రగడ్డ దయానంద్ కథా సంపుటి - వి.వి.ఐ.టీ.. 30వ ప్రచురణ 'పండుటాకు- గుండ్లకమ్మ తీరాన' పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా, సభకు ప్రముఖ అనువాదకుడు కందిమళ్ల శివప్రసాద్ సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ పాపినేని శివశంకర్ గ్రంథాన్ని ఆవిష్కరించగా, ప్రథమ ప్రతిని విశిష్ట అతిథిగా హాజరైన విజయవాడ పోస్ట్ మాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్ మూర్తికి అందజేశారు. ముఖ్య అతిథి, ఆవిష్కర్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలకుపైగా సాహిత్య సేద్యం చేస్తున్న కాట్రగడ్డ దయానంద్ అభినందనీయులని అన్నారు. మట్టి వాసనల కథకుడు అని కొనియాడారు. ప్రముఖ రచయిత్రి వి.ప్రతిమ పుస్తక సమీక్ష గావించగా, గౌరవ అతిథిగా వాసిరెడ్డి విద్యాసాగర్, ఆత్మీయ అతిథిగా వాసిరెడ్డి నవీన్ హాజరయ్యారు. సభలో కాట్రగడ్డ జయలక్ష్మి, చైతన్య, వసంత, కారుణ్య, నిహారిక, శాన్విక, వేదామృత, నిహారిక, ధృవ్ రామ్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా బాలికల జట్టు ఎంపిక



జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ బాలికల జట్టుకు ఎంపికైన వారితో సెక్రటరీ దుర్గాప్రసాద్

పెదకాకాని: రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరచి ఫుట్‌బాల్ కప్ సాధించడమే లక్ష్యమని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ దుర్గాప్రసాద్ అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జిల్లా జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపికలో జిల్లా స్థాయిలో ఆయా ప్రాంతాల నుంచి విద్యార్థినిలు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ కనపరచి బాలికలు 18 మందితో జిల్లా ఫుట్‌బాల్ జూనియర్ బాలికల జట్టును ఎంపిక చేశారు. 11 మంది ప్లేయర్స్, ఏడుగురు ఎక్స్‌ట్రా ప్లేయర్స్ పాల్గొనే జట్టులో ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 15 మంది బాలికలు, సత్తెనపల్లి బాలికల పాఠశాల నుండి ఒకరు, హోలీఫ్యామిలీ స్కూల్ నుండి ఒకరు, గుంటూరు లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ నుండి ఒకరు ఎంపికయ్యారు. ఈ జట్టు ఈనెల 6వ తేది నుండి రెండు రోజుల పాటు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్ ద్వారా ఫుట్‌బాల్ కోచింగ్ ఇవ్వడంతో ఉప్పలపాడు పాఠశాల నుంచి 15 మంది ఎంపికయ్యారని, శ్రమకు తగిన ఫలితం దక్కిందని పీఈటీ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ఎంపికలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మైనేని నాగేశ్వరరావు, ఫుట్‌బాల్ కోచ్ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

తూనికలు, కొలతల శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లా డెప్యూటీ కంట్రోలర్ శామ్యూల్ రాజు



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

క్రోసూరు: వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులు, తూనికలు, కొలతలు, ధరలపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని తూనికల కొలతల శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లా డెప్యూటీ కంట్రోలర్ టి.శామ్యూల్ రాజు చెప్పారు. గురువారం క్రోసూరులోని పలు దుకాణాలు, వ్యాపారల సంస్థలలో తూనికలశాఖ అధికారులు సత్తెనపల్లి ఎస్ఐ షేక్ సైదాతో కలిసి తనిఖీలు చేశారు. ఈసందర్భంగా మూడు చికెన్‌షాపుల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు ముద్రలు లేకపోవటం, తూకాల్లో తేడాలు ఉండటం గుర్తించి కేసులు పెట్టారు. రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనంలో కాటాకు ముద్రలేకపోవటంతోపాటు, ఆటోమొబైల్ షాపులో ప్యాకింగ్, కమోడిటీస్ నిబంధనలకు విరుద్ధంగా ప్యాకింగ్ ఉండటాన్ని గుర్తించారు. అనంతరం పత్తి కొనుగోలు చేసే బ్రోకరేజి కార్యాలయంలో కాటా తేడాగా ఉండటాన్ని గుర్తించి కేసులు పెట్టినట్లు శ్యామ్యూల్‌రాజు తెలియచేసారు. అనంతరం వినియోగదారులకు అవగాహన కల్పించారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉంటే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఎవరైనా 0863-2223202కు ఫోన్ చేసి మోసాలపై ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.

గణపవరం గ్రామంలో చోరీ



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

నాదెండ్ల: గణపవరం గ్రామంలో గురువారం మరో చోరీ జరిగింది. గత నెల 24న రెండు ఇళ్లలో జరిగిన జంట చోరీలను ప్రజలు మరువకముందే మరో దొంగతనం వెలుగులోకొచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన మిరియాల రామకృష్ణ దంపతులు మంగళవారం రాత్రి హైదరాబాద్ వెళ్ళారు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్ళగా, బీరువా తలుపులు ధ్వంసం చేసి ఉండటం, వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దుండగులు కిటికీలో నుంచి ఇంట్లోకి చొరబడి రంపపు బ్లేడుతో బీరువాను కట్ చేశారు. బీరువాలోని రూ.22 వేల నగదు, రెండు పట్టుచీరలు, విలువైన దుస్తులు దొంగిలించారు. బాధితుడు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

చిత్తూరు జట్టు ఘన విజయం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీలు మూడో మ్యాచ్‌లో చిత్తూరుజిల్లా జట్టు 291 పరుగుల తేడాతో కర్నూలు జిల్లా జట్టుపై ఘన విజయం సాధించింది. చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 374, రెండో ఇన్నింగ్స్‌లో 146 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులు చేసింది. కాగా, ఓవర్‌నైట్ స్కోర్ 2 వికెట్లు నష్టానికి 20 పరుగుల స్కోర్‌తో గురువారం మూడో రోజు ఆట ప్రారంభించిన కర్నూలు జట్టు తన ముందున్న 407 పరుగుల భారీ లక్ష్య సాధనలో చతికిలపడింది. 116 పరుగులకే ఆలౌట్ అయింది. కర్నూలు బ్యాట్స్‌మెన్ జి.ఎస్.భరద్వాజ్ 44 పరుగులు సాధించగా, చిత్తూరు బౌలర్లు ఎం.ప్రకాష్, సి.సోహన్‌రెడ్డికి చెరో 3 వికెట్లు లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం .. లింగంగుంట్ల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా కాచిగూడ నుంచి గుంటూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే ఎస్ఐ తన్నీరు సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి తెలుపురంగు చొక్కా, బ్లూరంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆనవాళ్లు తెలిసినవారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2800, గరిష్ట ధర రూ.4400, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.

రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు



సత్తెనపల్లి: రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డాక్టర్ రంగారావు మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలు మినహా 95 శాతం సేవలు రోగులకు అందుతున్నాయన్నారు. ఓపీ విభాగం బాగా రద్దీగా ఉంటుందని, తాను పరిశీలించిన సమయంలో 350 మందికిపైగా రోగులు ఉన్నారన్నారు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే వైద్య సేవలు బాగా మెరుగయ్యాయని చెప్పారు. స్కానింగ్, ల్యాబ్ పరీక్షలు బయటకు రాస్తున్నారని అప్పుడప్పుడు ఫిర్యాదులు వస్తున్నట్టు వివరించారు. ప్రధానంగా స్కానింగ్‌కు రేడియాలజిస్ట్ లేకపోవడం కొంత సమస్యగా ఉందని పేర్కొన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రైవేటు వైద్యశాలతో ఒప్పందం చేసుకునే యత్నం చేస్తున్నామని వివరించారు. ల్యాబ్ పరీక్షలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు పంపించే అవసరం లేదని, అలా పంపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు వైద్యశాలలో లేని అత్యాధునిక యంత్రాలు ఏరియా వైద్యశాల ల్యాబ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అంతకుముందు గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల మొత్తం క్షుణ్ణంగా పరిశీలించి సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావుకు, వైద్యులకు పలు సూచనలు చేశారు.